క్లుప్తంగా

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి


కరపలో గ్రామకార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: ఈ నెల 5వ తేదీన సామర్లకోటలో జరిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష జరిపి, పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజ లకు అవసరమయ్యే పనులు, అభివృద్ధి పనులు, ఇంటిపన్నులు, పారిశుధ్య పనులపైన చర్చించి, తీర్మానాలు చేయాలని ఎంపీడీఓ అప్పారావు సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరప మండలంలో పింఛన్ల పంపిణీ 86.46 శాతం పూర్తి


వేములవాడలో వృద్ధురాలు దెయ్యాల అదమ్మకు పింఛనులందజేస్తున్న వలంటీర్ దుర్గాభవాని

కరప: మండలంలో లబ్ధిదారులకు ఆదివారం, సోమవారం సెల వుదినాలైనా వలంటీర్లు, వెల్ఫేర్‌అసిస్టెంట్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. 11,677 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా రెండోరోజు మధ్యాహ్నానికి 10,100 మందికి (86.49 శాతం) పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్ని రకాల పింఛన్ల సొమ్ము రూ 3,18,67,000 లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉండగా రూ.2,75,69,000 అందించినట్టు తెలిపారు. మంగళ వారానికల్లా నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆయన చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

కరప: గ్రామాల అభివృద్ధికి వివిధ శాఖల అధికారులతో చర్చించి ప్రణాళిక రూపొందించేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నట్టు గ్రామకార్యదర్శులు బి.చంద్రకళ, వి.సునీల్ కుమార్ తెలిపారు. పెనుగుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో కార్యదర్శులు మాట్లాడారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహణపై పలు తీర్మానాలు చేశారు. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బోట్‌క్లబ్: శాకాహారం తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీ విశ్వశాంతి పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు అడబాల స్వర్ణ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం శాకాహారం తినడం వల్ల కలిగే లాభాలను తెలియజేస్తూ స్థానిక గాంధీనగర్ పార్కు వద్ద నుంచి తూరంగి వరకూ ర్యాలీ నిర్వహించారు. శాకాహారం తినడం వల్ల అంతఃకరణ నిర్మలత్వం ఏర్పడుతుందన్నారు. కలకాలం ఆరోగ్యంగా జీవించాలంటే సాత్వికాహారం మేలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిక, సుహాషిని, లలిత, రామారావు, పాండు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో రక్తదానం


రక్తదానం చేస్తున్న న్యాయవాదులను అభినందిస్తున్న జిల్లా జడ్జి ఎం.హరినారాయణ

కాకినాడ లీగల్: స్థానిక బార్ అసోసియేషన్‌హాలులో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావు, ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, జనరల్ సెక్రటరీ చక్కా శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కేబీ భద్రరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. గాంధీజయంతి సందర్భంగా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా జడ్జి ఎం.హరినారాయణ ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రక్తదానం చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ గాంధీజీకి వినతి

కరప: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని గాంధీ మహాత్మునికి సమగ్రశిక్ష ఎంప్లాయీస్ వినతిపత్రం సమర్పించారు. మండల విద్యావనరులకేంద్రం ఉద్యోగులు, సీఆర్పీలు పి.రాజు, బి.సారాకుమారి, పి.సత్యనారాయణ, పి.సునీత, వై.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం

- ఆకర్షణీయంగా ఎల్‌బీనగర్ పార్కు
- చిన్నారులకు ఆట పరికరాలు
- ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- వసతులపై సందర్శకుల హర్షం

బోట్‌క్లబ్: పచ్చని చెట్లు, చక్కని వాతావరణంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది ఎల్‌బీనగర్ పార్కు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్‌లో ఎల్‌బీనగర్‌లో ఉండే ఈ పార్కు గతంలో నిరాదరణకు గురై కంపచెట్లతో నిండి అడుగుపెట్టేందుకు వీలు లేకుండా ఉండేది. కార్పొరేషన్ ప్రత్యేక నిధులను కేటాయించడంతో పార్కు రూపురేఖలే మారిపోయాయి. చుట్టూ పరచుకున్న పచ్చదనం, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి

కాకినాడ కార్పొరేషన్ సహకారంతో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పార్కులో అందమైన మొక్కలును ఏర్పాటు చేయడంతో పార్కు కళకళలాడుతోంది. పార్కు సంరక్షణతోపాటు సుందరీకరణకు రూ.10 లక్షలు కార్పొరేషన్ నిధులును సమకూర్చడంతో పార్కు అందంగా తయారై ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఓపెన్ జిమ్, కూర్చేనేందుకు బల్లలు, ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టూ డ్రైనేజీ, ప్రవేశ ద్వారం ఇలా అన్ని సదుపాయాలతో పార్కు ప్రజలు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతోంది.

పెరుగుతున్న సందర్శకులు


పార్కులో సందర్శకులకు కోసం ఏర్పాటు చేసిన బెంచీలు


చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు


ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

గతంలో పార్కు ఉన్న పిచ్చి మొక్కలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండడంతో పార్కులో అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడేవారు. కేవలం వాకింగ్ చేసేందుకు మాత్రమే ఈ ప్రాంత ప్రజలు దీనిని వినియోగించుకొనేవారు. వాకింగ్ చేసి అలసిపోతే కొంత సేపు కూర్చునేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం పార్కులో చక్కని వాతావరణం, వసతులు కల్పించడంతో సందర్శకులు సంఖ్య పెరుగుతోంది. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ఆరోగ్యాభిలాషులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఎమ్మెల్యే సహకారంతో..



కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సహకారంతో పార్కు అభివృద్ధి సాధ్యమైంది. పార్కు పరిస్థితిపై ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లన వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీంతో పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్, పిల్లలకు ఆట పరికరాలు వంటి సమకూర్చడం జరిగింది. పార్కును మరెంత అభివృద్ధి చేసేందుకు స్థానిక కమిటీ సహకారం తీసుకొంటున్నాను.

– కోరుమిల్లి బాలప్రసాద్,
46 డివిజన్ మాజీ కార్పొరేటర్.

వాకింగ్‌కు ఎంతో అనువు



గతంలో నడవాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు పార్కును బాగా అభివృద్ధి చేశారు. దీంతో వాకింగ్ ట్రాక్‌కు సుందరంగా తీర్చిదిద్దడంతో వాకింగ్ చేయడానిక ఎంతో అనువుగా ఉంది. మా లాంటి వారికి ఈ పార్కు చాలా బాగా ఉపయోగపడుతుంది. చిన్నారులు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది.

–ఎల్‌బీనగర్ అసోసియేషన్ సెక్రటరీ
కృష్ణమూర్తి

నవరత్నాలతో ప్రజలకు మేలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గైగోలుపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం

కాకినాడ రూరల్: రాష్ట్రంలో నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల మన్ననలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుకుంటోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రమణయ్యపేట గ్రామ పరిధిలోని సచివాలయం -4 గైగోలుపాడులో మూడో రోజు ఆయన పర్యటించారు. సోమవారం సాయంత్రం గైగోలుపాడులోని వినాయకుని ఆలయం నుంచి పలు వీధుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో రమణయ్యపేట పంచాయతీలో నిర్వహిస్తున్నామని, ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు చాలా వరకు కల్పించామని, ఇంకా ఎవరైనా విన్నవించినా వాటిని గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు మంజూరు చేస్తున్న నిధులతో తక్షణం ప్రతిపాదనలు చేసి ప్రణాళిక ప్రకారం వాటిని అమలు చేస్తున్నామన్నారు. ప్రజల కోసం ఎంతో శ్రమిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ఎన్నికల్లో గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురార్జీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కడియాల చినబాబు, పాలిక ప్రకాష్, గుబ్బల విజయ్‌కుమార్, మేడిశెట్టి లక్ష్మి, పాలిక రమణ, పి.ధర్మారావు, నాని, కృష్ణంరాజు, రామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ దవులూరి వెంకటరమణ, నేమం సర్పంచ్ రామదేవు చిన్న తదితరులు పాల్గొన్నారు.


గైగోలుపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కాకినాడ రూరల్: వీధులు, గ్రామాలను పరిశుభ్రంగా పారిశుధ్య కార్మికులను కాకినాడ రూరల్ తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ సోమవారం కాళ్లు కడిగి ఘనంగా సన్మానించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కాకినాడ రూరల్ మండలంలో పలు గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రజలకు సేవ చేసే కార్మికులకు సన్మానించినట్టు ఆయన తెలిపారు. వలసపాకల గ్రామంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి బీబీ తదితరులు చీపుర్లు పట్టుకుని గ్రామంలో పరిసరాలు శుభ్రం చేశారు. రమణయ్యపేటలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దవులూరి వెంకటరమణ ఆధ్వర్యంలో గైగోలు పాడు నుంచి రాజీవ్‌గాంధీ లా కళాశాల కాలువ గట్టు వరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా చెత్త శుభ్రం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాలిక నరసింహమూర్తి, గంజా సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపురంలో పారిశుధ్య కార్మికుడి కాళ్లను కడుగుతున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ సోమవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థి ఐటీఐ కళాశాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐలకు 9 తేదీన, ప్రైవేట్ ఐటీఐలకు 10వ తేదీన హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 0884-2348182 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

క్యాబినెట్ నిర్ణయాలపై వైఎస్సార్ టీపీ హర్షం

బాలాజీచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ నిర్ణయాలపై వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. విద్యా రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నామని, ఉపాధ్యాయులకు జీపీఎస్ పథకం ప్రవేశపెట్టడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అయ్యేనాటికి తప్పనిసరిగా ఇంటి స్థలం ఉండాలని నిర్ణయం తీసుకోవడం సంతోషమన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పిల్లల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయడంపై ఆనందంగా ఉందన్నారు. జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు నక్కా వేంకటేశ్వరరావు, ప్రధాన కార్యవర్శి వీరవల్లి గోపికృష్ణ ప్రకటన విడుదల చేశారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్పోర్ట్స్ విద్యార్థులకు 0.5 క్రెడిట్స్ కేటాయించినట్లుగా గ్రంథాలయ పఠనం చేసే విద్యార్థులకు క్రెడిట్స్ కేటాయించేలా ఆలోచన చేయాలని గోదావరి లైబ్రరీ అసోసియేషన్ సోమవారం ఒక ప్రకటనలో ఉన్నత విద్యాశాఖాధికారులను కోరింది. విద్యార్థుల్లో గ్రంథాలయ పఠన అభివృద్ధి పెంపొందింపజేయడానికి దోహదపడుతుందని, క్రెడిట్స్ కేటాయించడం ద్వారా తప్పకుండా ప్రతిరోజూ గ్రంథాలయాలు సందర్శిస్తారన్నారు. ఈ విషయంపై నిర్ణయం తీసుకుని విద్యార్థుల అభివృద్ధితో పాటు గ్రంథాలయాల ప్రాధాన్యత తెలిసేలా చేయాలని కోరారు. దీనిపై జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వీసీ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశామని, ఉన్నత విద్యాశాఖాధికారులకు విన్నవిస్తామన్నారు. ప్రకటన తెలిపిన వారిలో గోదావరి లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు, సభ్యులు ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాత మహాత్మా గాంధీజీ

- జెడ్పీ సీఈవో రమణారెడ్డి
- జాతిపిత, లాల్‌బహదూర్‌శాస్త్రికి ఘన నివాళులు

కాకినాడ సిటీ: జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్ర్య సమరంలో అహింస మార్గాన్ని ఎంచుకొని అనేక మంది నాయకులకు, ప్రజలకు స్ఫూర్తినిచ్చిన గొప్ప నాయకుడు అని జిల్లా పరిషత్ సీఈవో ఏ రమణారెడ్డి అన్నారు. సోమవారం గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతాపతి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. కాకినాడ ఏపీ ఎన్‌జీవో హోంలో జిల్లా కార్యదర్శి పేపకాయల కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని సందర్భంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ వివిధ విభాగాధిపతులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి కార్యాలయం కోర్టు హాలులో గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ రూరల్ మండలం తూరంగిలో వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్మికులకు భోజన ఏర్పాట్లు చేశారు.


రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ

తరతరాలకూ జాతిపిత మహాత్మాగాంధీ : మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: భారత దేశం ఉన్నంత కాలం జాతిపితగా తరతరాలకు నిలబడిపోయే మహానాయకుడు మహాత్మాగాంధీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి కన్నబాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, పుల్ల కోటేశ్వరరావు, కర్రి నారాయణరావు, ధనరాజు, వాసురెడ్డి సూరిబాబు, పల్లంరాజు, నల్ల రాణి, రేఖారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత మహాత్మాగాంధీ

కాకినాడ: శాంతి అహింస మార్గంలో బ్రిటీష్‌పాలకులను గడగడలాడించిన జాతిపిత గాంధీ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన సోమవారం గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ కార్యాలయం, ఆర్టీసీ, వివేకానంద పార్కులో గాంధీ జయంతిని నిర్వహించారు.


జెడ్పీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి

కరప మండలంలో..

కరప: మండలంలో సోమవారం గాంధీ మహాత్ముని, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావులు వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఎంపీటీసీ అనసూరి శ్రీనివాస్, ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు, మాజీఎంపీటీసీ పెంకే సత్తిబాబులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరరావు, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ఎస్.రామకృష్ణ జాతిపిత మహాత్మునికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వివిధ చోట్ల జరిగిన ఈ వేడుకల్లో సర్పంచ్‌లు రొక్కాల గణేష్, సాదే ఆశాజ్యోతి, చింతా నాగలక్ష్మి, అడబాల సత్య, వాసంశెట్టి రామారావు, మార్నెళ్ల శివ,దేగల లలితకుమారి, వాసంశెట్టి శ్రీనుబాబు, కొత్త నాగలక్ష్మి, కమిడి మంగాదేవి, నున్న సుజాత, నాగిరెడ్డి ఏసుబాబు, వెలుగుబంట్ల రాఘవ, నక్కా బాబులు, వాసంశెట్టి కొండ, కె.రమాదేవి, బొమ్మిడి నయోమి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రాధాన్యతను చాటిన నాయకుడు శాస్త్రి

బోట్‌క్లబ్: రైతు ప్రాధాన్యత చాటిన గొప్ప నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. స్థానిక రామకృష్ణారావుపేటలోని సోమవారం లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడిమల్ల చెరియన్, పైడా వెంకటనారాయణ, సత్తి గోపాలకృష్ణ, గంగావశం త్రినాథ్‌దేవ్, శివ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో..

జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో ఉన్న గాంధీ విగ్రహానికి వీసీ ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ సుమలత,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్,టీచింగ్,నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: స్థానిక గాంధీభవన్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పూలమాలలు వేసి నివాళు అర్పించారు.

ఏపీజీఆర్‌ఈ కార్యాలయంలో..

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యాలయంలో గాంధీ జయంతిని నిర్వహించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి శాస్త్రి ముఖ్యఅతిథిగా వచ్చి గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో గాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఆస్పత్రి అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా వచ్చిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయా యూనివర్సిటీలో, సర్పవరం జంక్షన్ లో బోట్‌క్లబ్ బాకర్స్ సంఘం ఆధ్వర్యంలోనూ, ఇంద్రపాలెంలో ఏఎంసీ చైర్మన్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.


కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో శ్రీధర్‌రెడ్డి తదితరులు


కరప ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

క్రీడాకారుడికి ఆర్థిక సాయం


శ్రీనివాసరావుకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తూ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడిగా జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్న మందపల్లి శ్రీనివాసరావుకు జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అందజేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం శ్రీనివాసరావును అభినందించి నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి దేశానికి పేరుకు తీసుకు రావాలని సూచించారు. కాకినాడకు మంచి పేరు తీసుకువచ్చిన శ్రీనివాసరావు అండగా ఉంటామన్నారు. సహాయం అందించిన రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందిపాటి పల్లయ్య, సంఘ కాకినాడ రూరల్ అధ్యక్షుడు డి.మనోరవితేజ(సన్నీ), మండల కార్యదర్శి నందిపాటి వీరబాబులను ఎమ్మెల్యే కన్నబాబు అభినందించారు.

మార్పుతో మంచి భవిష్యత్తు


ఆటల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న హరినారాయణ తదితరులు

కాకినాడ లీగల్: ఆశ్రమవాసులు(ఖైదీలు) ప్రవర్తనలో, ఆలోచనా విధానాల్లో మార్పు రావడం ద్వారా సమాజంలో గౌరవంగా జీవించావచ్చని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ అన్నారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా కాకినాడ స్పెషల్ సబ్‌జైలులో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా జడ్జి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎం.హరినారాయణ మాట్లాడుతూ ఆశ్రమవాసులు జైలులో ఉన్నామని అనూన్యతాభావంతో ఉండకుండా ప్రవర్తనలో మార్పుతెచ్చుకుని సన్మార్గాన్ని అలవర్చుకుని సమాజంలో గౌరవంగా బతకాలన్నారు. దీనిని ఖైదీలు గ్రహించి సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఖైదీల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపికృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ వైఎస్సార్ టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తమ్మవరం ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ వీరవల్లి గోపికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైఎస్సార్ టీఎఫ్ వర్కింగ్ అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆదేశాల జారీ చేశారు. తనను నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని గోపికృష్ణ తెలిపారు.

గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి


డాక్టర్ చిరంజీవిని కుమారిను సత్కరిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు


జేఎన్‌టీయూకేలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పించిన వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఐడియల్ విద్యాసంస్థల కార్యదర్శి పి.చిరంజీవిని కుమారి పేర్కొన్నారు. యూనియన్ కాకినాడ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం 154వ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్ముని జీవన నిబంధనలైన అహింస, సమానత్వం, శాంతి, స్త్రీ అభివృద్ధి వంటి వాటి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి సాయి మనోహర్,డి.వి.రంగారావు,పున్నంరాజు ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.